సాక్షి రంగారెడ్డి
ఆదివారం : 18 : ఆగస్టు : 2024



ముఠా గుట్టు రట్టు!

తక్కువ ధరకు హ్యాష్ ఆయిల్ తీసుకొచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తున్న ముఠాను పోలీసులు అరెస్టు చేశారు. 8లో▸



షాద్‌నగర్‌రూరల్: షాద్‌నగర్ పట్టణంలో వైద్యులు, సిబ్బంది నిరసన

న్యూస్‌రీల్

కాంగ్రెస్ పార్టీ జిల్లా స్పోక్స్ పర్సన్‌గా గుల్షాన్



నర్సింహారెడ్డి చేతుల మీదుగా నియామకపత్రం అందుకుంటున్న గుల్షాన్

హుడాకాంప్లెక్స్: కాంగ్రెస్ పార్టీ జిల్లా స్పోక్స్ పర్సన్‌గా మొహమ్మద్ ఇస్తియాక్ గుల్షాన్ నియమితులయ్యారు. ఈ మేరకు శనివారం పార్టీ జిల్లా అధ్యక్షులు చల్లా నర్సింహారెడ్డి చేతుల మీదుగా గుల్షాన్ నియామకపత్రం అందుకున్నారు. ఈ సందర్భంగా గుల్షాన్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో పదవి అప్పగించినందుకు బాధ్యతగా పనిచేసి పార్టీ అభ్యున్నతికి కృషి చేస్తానని తెలిపారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళతానని అన్నారు. చల్లా నర్సింహారెడ్డి, నియోజకవర్గ ఇన్‌చార్జి కిచ్చన్నగారి లక్ష్మారెడ్డి, దేప భాస్కర్‌రెడ్డి, వీఎస్ఎన్ శ్రీనివాస్‌రావు, మతిన్ షరీఫ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రేపు సీజీఆర్ సంస్థ ఆధ్వర్యంలో 'వృక్షాబంధన్'

కడ్తాల్: సీజీఆర్ సంస్థ ఆధ్వర్యంలో ఈ నెల 19న వృక్షాబంధన్ కార్యక్రమం నిర్వహించనున్నట్లు సంస్థ ప్రతినిధులు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 11 సంవత్సరాలుగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతి ఒక్కరూ మొక్కకు గాని, చెట్టుకు గానీ రాఖీ కట్టాలని సూచించారు. 'నేను నీకు రక్ష .. మనమిద్దరం ప్రకృతి మాతకు రక్ష' అని ప్రతిజ్ఞ చేయాలన్నారు. ఈ మహత్తర కార్యక్రమానికి సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో 'సీజీఆర్ వృక్షాబంధన్' పేరుతో షేర్ చేయాలని కోరారు. ప్రతి ఒక్కరూ తమ ఇళ్ల వద్ద, కార్యాలయాల వద్ద ఈ కార్యక్రమాన్ని చేపట్టాలని విజ్ఞప్తి చేశారు.

ఎయిడెడ్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి



ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంకు వినతిపత్రం అందజేస్తున్న ఉద్యోగులు

షాద్‌నగర్‌రూరల్: ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ఎయిడెడ్ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని తెలంగాణ విద్యావంతుల వేదిక (టీవీవీ) రాష్ట్ర కోశాధికారి టీజీ శ్రీనివాస్ కోరారు. ఈ మేరకు శనివారం ఎయిడెడ్ ఉద్యోగులతో నగరంలో ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పని చేస్తున్న ఉద్యోగులు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. పదేళ్ల బీఆర్ఎస్ పాలనలో ఎయిడెడ్ ఉద్యోగులను పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఉద్యోగుల సమస్యలను నెరవేర్చేందుకు చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. స్పందించిన ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరాం ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో విధులు నిర్వర్తిస్తున్న ఉద్యోగుల సమస్యలను సీఎం రేవంత్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. వినతిపత్రం అందజేసిన వారిలో ఎయిడెడ్ ఉద్యోగులు సుమన, రిచర్డ్స్ తదితరులు ఉన్నారు.

మెట్రోకోచ్‌ల సంఖ్యను పెంచండి

మెట్రోరైల్ భవన్ ఎదుట సీపీఎం నేతల ధర్నా

సనత్‌నగర్: మెట్రోరైల్‌లో పెరిగిన ప్రయాణికుల రద్దీ దృష్ట్యా బోగీలను 3 నుంచి 6కు పెంచాలని సీపీఎం ఆధ్వర్యంలో బేగంపేటలోని మెట్రోరైల్ భవన్ ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. అనంతరం నగర కార్యదర్శి శ్రీనివాస్‌తో పాటు కార్యదర్శివర్గ సభ్యులు కేఎం రాజన్న, మహేందర్, నాగలక్ష్మి మెట్రోరైల్ ఎండీ ఎన్వీఎస్‌రెడ్డిని కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మెట్రోరైల్‌లో రద్దీ బాగా పెరిగి ప్రయాణం కష్టంగా మారిందన్నారు. బ్లూలైన్, రెడ్‌లైన్లలో పీక్‌టైంలో అయితే రైలు ఎక్కడం, దిగడం కూడా ఇబ్బందిగా మారిందన్నారు. రైల్లో నిల్చునే పరిస్థితి ఏర్పడుతోందన్నారు. ప్రయాణికుల రద్దీకి అనుగుణంగా మెట్రోరైల్ కోచ్‌లను మూడు నుంచి ఆరుకు పెంచుతామని గతంలో అధికారులు ప్రకటించినప్పటికీ ఎలాంటి చర్యలు చేపట్టలేదన్నారు. కొన్ని స్టేషన్లలో ఇప్పటివరకు ఫ్రీగా ఉన్న పార్కింగ్ స్థలాలకు కూడా భారీగా చార్జీలు వసూలు మొదలు పెట్టారని ఆరోపించారు. పార్కింగ్ చార్జీలు రద్దు చేయాలని విజ్ఞప్తి చేశారు.



ఆమనగల్లు: ప్రభుత్వాస్పత్రి వైద్యులు, సిబ్బంది, విద్యార్థుల మానవహారం



ఇబ్రహీంపట్నం: ప్రభుత్వాస్పత్రిలోని ఓపీ విభాగానికి తాళం

ఓపీ ఆపి..

కోల్‌కతాలో యువ పీజీ డాక్టర్‌పై అత్యాచారం, హత్య ఘటనను నిరసిస్తూ శనివారం జిల్లాలోని ప్రభుత్వ, ప్రైవేట్ ఆస్పత్రుల్లో వైద్య సేవలు నిలిపివేశారు. వైద్యులంతా నల్ల బ్యాడ్జీలు ధరించి.. ప్లకార్డులు చేతపట్టుకుని పెద్ద ఎత్తున ర్యాలీలు, మానవహారాలు చేపట్టారు. కోల్‌కతా ఘటనలో నిందితులను కఠినంగా శిక్షించాలని, వైద్య సిబ్బందికి రక్షణ కల్పించాలని నినదించారు.

డెంగీ పంజా



రోజురోజుకూ పెరుగుతున్న కేసులు

- జిల్లాలో ఇప్పటివరకు 180పైగా నమోదు
- తాజాగా శంకర్‌పల్లిలో తొమ్మిదేళ్ల బాలుడు మృతి!
- కంటిమీద కునుకు లేకుండా చేస్తున్న దోమలు
- ఆస్పత్రులకు క్యూ కడుతున్న బాధితులు

సాక్షి, రంగారెడ్డిజిల్లా: మూడేళ్లుగా స్తబ్దుగా ఉన్న డెంగీ దోమలు.. తాజాగా మృత్యు ఘంటికలు మోగిస్తున్నాయి. ఇప్పటికే అనేక మంది అధిక జ్వరం, ఒంటి నొప్పులు, చర్మం పొడిబారడం, కళ్లలో మంటలు వంటి సమస్యలతో బాధపడుతూ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. తాజాగా శంకర్‌పల్లి మండలం టంగుటూరుకు చెందిన తొమ్మిదేళ్ల బాలుడు అనుమానిత డెంగీ జ్వరంతో మృతి చెందడం సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. డెంగీ బాధితుల వివరాలను ఎప్పటికప్పుడు జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారులకు తెలియజేయాల్సి ఉన్నా.. పలు ప్రైవేటు ఆస్పత్రులు గోప్యతను పాటిస్తున్నాయి. సాధారణ జ్వరంతో బాధపడుతున్న వారిని కూడా డెంగీగా అనుమానించి, వ్యాధి నిర్ధారణ పరీక్షలు, ఐసీయూలో చికిత్సల పేరుతో నిలువుదోపిడీకి పాల్పడుతున్నాయి.

పూల కుండీలే దోమల ఆవాసాలు

శివారు ప్రాంతాలు శరవేగంగా విస్తరిస్తున్నాయి. లోతట్టు ప్రాంతాల్లో పారిశుద్ధ్య లోపానికి తోడు ఇళ్ల చుట్టూ వర్షపు నీరు నిల్వ ఉంటోంది. బహుళ అంతస్తుల నిర్మాణాల కోసం భారీ సెల్లార్లు తవ్వుతున్నారు. కొత్తగా చేపట్టే నిర్మాణాలు, స్లాబ్, గోడల క్యూరింగ్ కోసం నీటిని వాడుతున్నారు. గదులతో పాటు స్లాబులపై రోజుల తరబడి నీరు నిల్వ ఉండటం, కింద ఉన్న సంపులపై మూతలు లేకపోవడంతో డెంగీ దోమలకు నిలయంగా మారుతున్నాయి. అంతేకాదు విల్లాలు, గేటెడ్ కమ్యూనిటీలు, ధనవంతుల నివాసాల్లో ఆహ్లాదం, అందం కోసం ఇంట్లో పూల కుండీలు ఏర్పాటు చేసి, మొక్కలు నాటుతున్నారు. ఈ కుండీల్లో వర్షపు నీరు చేరి డెంగీ దోమలకు ఆవాసాలుగా మారుతున్నాయి. దోమల నియంత్రణ కోసం యాంటిలార్వ, ఫాగింగ్ వంటి చర్యలు చేపట్టకపోవడంతో ప్రజల కంటిమీద కునుకు లేకుండా చేస్తున్నాయి. రాష్ట్ర వ్యాప్తంగా ఇప్పటి వరకు 3,357 డెంగీ పాజిటివ్ కేసులు నమోదు కాగా, హైదరాబాద్ జిల్లాలో అత్యధికంగా 1,276..మేడ్చల్ జిల్లాలో 312, రంగారెడ్డి జిల్లాలో 180, వికారాబాద్‌లో ఏడు కేసులు నమోదయ్యాయి. కోర్‌సిటీలోని బస్తీలతో పోలిస్తే.. ధనవంతులు ఎక్కువగా నివసించే శివారు ప్రాంతాల్లోని శేరిలింగంపల్లి, నార్సింగి, కోకాపేట్, గోపన్‌పల్లి, రాజేంద్రనగర్, అత్తాపూర్, శంషాబాద్, మీర్‌పేట్, బడంగ్‌పేట్, పెద్ద అంబర్‌పేట్, తుర్కయంజాల్, తుక్కుగూడ, ఆదిబట్ల, శంకర్‌పల్లి మున్సిపాలిటీల పరిధిలో ఈ కేసులు నమోదవుతుండటం విశేషం. మంచినీటి ట్యాంకులపై మూతలు పెట్టడం, చెట్లపొదలను శుభ్రం చేయడం ,పూల కుండీల్లో నీటినిల్వ లేకుండా చేయడం ద్వారా డెంగీ దోమలను నియంత్రించే అవకాశం ఉందని వైద్య నిపుణులు సూచిస్తున్నారు.

గుర్తించడం ఇలా..

- ఈడిస్ ఈజిప్టై (టైగర్ దోమ) కుట్టడం ద్వారా డెంగీ సోకుతుంది. ఇది పగటి పూట మాత్రమే కుడుతుంది. దోమ కుట్టిన 7 నుంచి 8 రోజులకు హఠాత్తుగా తీవ్రమైన జ్వరం వస్తుంది.
- కళ్లు కదలించలేని పరిస్థితి ఉంటుంది. ఎముకలు, కండరాల్లో భరించ లేని నొప్పి, శరీరంపై ఎర్రటి పొక్కులు వస్తాయి.
- రక్త కణాల (ప్లేట్స్ లెట్స్) సంఖ్య పడిపోతుంది. కొన్నిసార్లు అవయవాలన్నీ పనిచేయడం మానేస్తాయి.
- జ్వరపీడితుల్లో తెల్లరక్త కణాల సంఖ్య పడిపోయి రోగనిరోధక శక్తి తగ్గుతోంది.
- సాధారణంగా మనిషి రక్తంలో 1.50 లక్షల నుంచి 4.50 లక్షల వరకు ప్లేట్‌లెట్స్ ఉంటాయి. ప్రస్తుతం ఆస్పత్రులకు వస్తున్న రోగుల్లో ప్లేట్‌లెట్ కౌంట్ 40 వేల లోపే ఉంటోంది.
- వాస్తవానికి వీటి సంఖ్య 25 వేల వరకు ఉన్నా పెద్ద ప్రమాదం ఏమీ ఉండదు. ఒక వేళ ఈ కౌంట్ 20 వేలకు పడిపోయి నోరు, ముక్కు నుంచి రక్తస్రావమైతే వెంటనే ప్లేట్‌లెట్స్ పునరుద్ధరించాలి. లేదంటే షాక్‌కు గురై కోమాలోకి వెళ్లి చనిపోయే ప్రమాదం ఉంది.
- లక్షణాలు గుర్తించి వెంటనే చికిత్స తీసుకోవడం ద్వారా డెంగీ నుంచి బయటపడొచ్చు.

–డాక్టర్ వెంకటేశ్వర్‌రావు, జిల్లా వైద్యాధికారి

ఆ ఒక్కరు ఎవరు?

- షాద్‌నగర్ ఘటనలో సస్పెండైన ఆరుగురు పోలీసులు
- ఎఫ్ఐఆర్‌లో మాత్రం ఐదుగురు
- సస్పెన్షన్‌కు గురై ఎఫ్ఐఆర్‌లో కేసు నమోదు కానిదెవరో..

షాద్‌నగర్‌రూరల్: దళిత మహిళపై దాడి ఘటన రాష్ట్ర వ్యాప్తంగా సంచలనం సృష్టించిన విషయం తెలిసిందే. ఈ ఘటనపై వెంటనే స్పందించిన పోలీసు ఉన్నతాధికారులు షాద్‌నగర్ డిటెక్టివ్ ఇన్‌స్పెక్టర్(డీఐ) రామిరెడ్డితో సహా ఐదురుగు కానిస్టేబుళ్లపై శాఖాపరమైన చర్యలు తీసుకున్నారు. ఆరోపణలు ఎదుర్కొన్న వారందరినీ సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. సంచలనం సృష్టించిన ఈ ఘటనలో పోలీసుల చేతిలో దెబ్బలు తిన్న దళిత మహిళ సునీత తనను డీఐ రామిరెడ్డితోపాటు మరో నలుగురు పోలీసులు విచక్షణారహితంగా కొట్టారని, వారిపై చర్యలు తీసుకోవాలని, తనకు పోలీసుల నుంచి ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని కోరుతూ షాద్‌నగర్ పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు డీఐ రామిరెడ్డితోపాటు మరో నలుగురు కానిస్టేబుళ్లపై వివిధ సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు.

ప్రశ్నార్థకంగా..

దళిత మహిళపై దాడి కేసులో శాఖాపరమైన చర్యల కింద పోలీసు అధికారులు డీఐ రామిరెడ్డి సహా ఐదుగురు సిబ్బందిని సస్పెండ్ చేశారు. మహిళ అని చూడకుండా తనపై అకారణంగా, విచక్షణారహితంగా కొట్టి గాయాల పాలుచేసిన డీఐ, నలుగురు పోలీసులపై చర్యలు తీసుకోవాలని సునీత పోలీస్‌స్టేషన్‌లో లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసింది. దీంతో పోలీసులు డీఐ రామిరెడ్డితో పాటుగా మరో నలుగురు కానిస్టేబుళ్లపై ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. దళిత మహిళపై దాడి ఘటన వెలుగులోకి వచ్చిన సమయంలో డీఐ సహా ఐదుగురు సిబ్బందిపై వేటు వేశారు. కానీ సునీత ఫిర్యాదుతో డీఐతో పాటు నలుగురిపై కేసు నమోదు చేశారు. ఎఫ్ఐఆర్‌లో లేని కానిస్టేబుల్ ఎవరనేది ప్రశ్నార్థకంగా మారింది. కేసు నమోదైన కానిస్టేబుళ్లు ఎవరు, సస్పెన్షన్‌కు గురై ఎఫ్ఐఆర్‌లో కేసు నమోదు కాకుండా ఉన్న కానిస్టేబుల్ ఎవరనేది చర్చనీయాంశంగా మారింది. ఈ విషయమై సీఐని ఫోన్‌లో సంప్రదించడానికి ప్రయత్నించగా అందుబాటులోకి రాలేదు.

ఆపద్బాంధవులైన ట్రాఫిక్ పోలీసులు



వాహనాలను బయటికి తీయిస్తున్న ట్రాఫిక్ పోలీసులు



హస్తినాపురం: అది వనస్థలిపురంలోని విజయవాడ జాతీయ రహదారి. భారీ వర్షం కారణంగా వరద ముంపులో నాలాలోకి ఓ కారు దూసుకెళ్లింది. ఈ క్రమంలో వనస్థలిపురం ట్రాఫిక్ పోలీసులు సమయస్ఫూర్తితో వ్యవహరించారు. కారులో ఉన్న ముగ్గురు చిన్నారులు సహా ఆ కుటుంబ సభ్యులను రక్షించిన ఘటన చోటుచేసుకుంది. శుక్రవారం రాత్రి హయత్‌నగర్‌కు చెందిన జిల్లా వినోద్ భార్యా పిల్లలతో కలిసి తన కారులో ఎల్‌బీనగర్ వైపు వెళ్తున్నారు. వర్షం భారీ కురుస్తోంది. వీరు వనస్థలిపురం పనామా చౌరస్తా దగ్గరకు చేరుకోగానే వరద ఉద్ధృతికి కారు అదుపుతప్పి పక్కన ఉన్న వర్షపునీటి నాలాలోకి దూసుకెళ్లింది. అక్కడే విధుల్లో ఉన్న ట్రాఫిక్ సీఐ వెంకటేశ్వర్లు ప్రమా దాన్ని గమనించారు. అక్కడే ఉన్న ఇద్దరు కానిస్టేబుళ్లు సైదులు, శ్రీనివాసరావులను అప్రమత్తం చేసి సమయస్ఫూర్తితో వ్యవహరించారు. కారులో ఉన్న ముగ్గురు చిన్నారులు సహా కుటుంబం మొత్తాన్ని సురక్షితంగా కాపాడారు.



కోర్టు భవనాల కాంప్లెక్స్‌లకు శంకుస్థాపన చేస్తున్న పట్టాభిరామారావు

ప్రజల చెంతకే కోర్టులు

- జిల్లా ఒకటో అదనపు కోర్టు సెషన్స్ జడ్జి పట్టాభిరామారావు

మహేశ్వరం: ప్రజల చెంతకే కోర్టులు వస్తున్నాయని జిల్లా ఒకటో అదనపు కోర్టు సెషన్స్ జడ్జి పట్టాభిరామారావు పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయం ప్రాంగణంలో రెండెకరాల విస్తీర్ణంలో రూ.24 కోట్లతో చేపట్టిన మహేశ్వరం కోర్టు నూతన భవనాల కాంప్లెక్స్‌ల నిర్మాణానికి శనివారం ఆయన మహేశ్వరం కోర్టు జడ్జి, న్యాయవాదులతో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. అందరికీ న్యాయం అందుబాటులోకి తీసుకురావడమే లక్ష్యంగా ఉన్నత న్యాయస్థానాలు పని చేస్తున్నాయని అన్నారు. చట్టాలు, న్యాయంపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని సూచించారు. న్యాయం ఒకరికి చుట్టం కాదని అందరికీ సమానమని స్పష్టం చేశారు. గతంలో వివిధ కేసుల విషయంలో కోర్టుకు వెళ్లాలంటే మహేశ్వరం ప్రజలు హైదరాబాద్, ఇబ్రహీంపట్నం వెళ్లేవారని, మహేశ్వరంలో కోర్టు ఏర్పాటైనప్పటి నుంచి దూర భారం తప్పిందన్నారు. త్వరలో మహేశ్వరంలో సీనియర్ జడ్జి కోర్టు రాబోతోందన్నారు. కార్యక్రమంలో మహేశ్వరం కోర్టు జూనియర్ సివిల్ జడ్జి ఎం.అపర్ణ, కందుకూరు ఆర్డీఓ సూరజ్ కుమార్, మహేశ్వరం జోన్ డీసీపీ సునీతారెడ్డి, ఏసీపీ లక్ష్మీకాంతరెడ్డి, తహసీల్దార్ రాజశేఖర్, సీఐ వెంకటేశ్వర్లు, కోర్టు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎల్.హరికిషన్ గౌడ్, మాజీ అధ్యక్షులు ఇబ్రాయేల్, రామిరెడ్డి, శ్రీనివాస చారి తదితరులు పాల్గొన్నారు.

ఫ్యూచర్ సిటీకి ఎక్స్‌ప్రెస్ వే

- రావిరాల నుంచి డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్
- కింది రెండు వరుసల్లో రోడ్డు మార్గం
- ఆపై భాగంలో మెట్రో రైలు పరుగులు
- నాగ్‌పూర్ తరహాలో నిర్మాణానికి ప్రతిపాదన



సాక్షి, రంగారెడ్డిజిల్లా: బేగరికంచెలో ప్రతిపాదించిన ఫ్యూచర్ సిటీని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా భావిస్తోంది. భావితరాల అవసరాలకు అనుగుణంగా ఆ ప్రాంతాన్ని సకల సదుపాయాలతో అభివృద్ధి చేసే దిశగా అడుగులు వస్తోంది. ఈ క్రమంలో ఎయిర్‌పోర్టు నుంచి ముచ్చర్ల/బేగరికంచెకు మెట్రో రైలును పొడిగించాలని నిర్ణయించింది. అయితే.. ఈ రైలు మార్గాన్ని వినూత్నంగా డిజైన్ చేస్తోంది. ఇప్పటికే మహారాష్ట్రలోని నాగ్‌పూర్‌లో అందుబాటులో ఉన్న రోడ్డు, రైలు మార్గం తరహాలో ఇక్కడ నిర్మించే అంశాన్ని పరిశీలిస్తోంది.

డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్

శంషాబాద్ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి బేగరికంచె వరకు మెట్రో రైలును విస్తరించాలని భావిస్తున్న సర్కారు.. ఔటర్ రింగ్‌రోడ్డు నుంచి రావిరాల జంక్షన్ మీదుగా ముచ్చర్ల/బేగరికంచె చేరుకునేలా ప్రతిపాదిస్తోంది. అయితే.. రావిరాల ఎగ్జిట్ వరకు సాధారణంగా ఎలివేటెడ్ కారిడార్‌లో వచ్చే రైలు.. ఇక్కడి నుంచి మాత్రం డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ మీదుగా ప్రయాణించనుంది. దీనికి అనుగుణంగా రావిరాల ఎగ్జిట్ నుంచి బేగరికంచె వరకు ఉన్న 200 ఫీట్ల ఎక్స్‌ప్రెస్‌వేను వినూత్నంగా డిజైన్ చేస్తోంది. డబుల్ డెక్కర్ ఫ్లై ఓవర్ నిర్మించడం.. ఈ రెండు మార్గాలను రోడ్డు రవాణాకు వినియోగించడం.. ఆపై భాగంలో మెట్రో రైలు సాగేలా డిజైన్లను రూపొందిస్తోంది. ఈ మేరకు ఇప్పటికే పలు సర్వేలు నిర్వహించిన యంత్రాంగం.. రావిరాల నుంచి 18 కిలోమీటర్ల మేర గ్రీన్‌ఫీల్డ్ రహదారిని అభివృద్ధి పరచడం మంచిదనే అభిప్రాయానికి వచ్చినట్లు తెలుస్తోంది. ఈ మార్గం ఇరువైపులా ఆకాశహార్మ్యలు (టవర్లు), రహదారితో పాటు మెట్రోకు అవసరమైన 400 ఎకరాలను ల్యాండ్‌పూలింగ్ ద్వారా సేకరించే అంశాన్ని పరిశీలిస్తోంది. ఇందుకు భూములు ఇచ్చే రైతులకు సంతృప్తికరమైన నష్టపరిహారాన్ని కూడా చెల్లించేలా ప్యాకేజీని తయారు చేస్తోంది.

సిగ్నల్ ఫ్రీ జర్నీ..

200 ఎకరాలను రోడ్డు కోసం.. మిగతా 200 ఎకరాలను టవర్ల నిర్మాణం కోసం సమీకరించాలని యోచిస్తోంది. కింది మార్గంలో 10 లేన్లు, పై మార్గంలో 8 లేన్ల ఫ్లైఓవర్ రోడ్డును వేసే అంశాన్ని కూడా పరిశీలిస్తోంది. కింది మార్గంలోని రోడ్డు వెంట హోటళ్లు, ఆస్పత్రులు, విద్యాసంస్థలు, ఇతర వాణిజ్య, వ్యాపార సముదాయాలు రానున్నాయి. రహదారికి ఇరువైపులా ఉన్న ప్రాంతాలను ఈ రోడ్డుతో అనుసంధానించనుంది. అదే పైమార్గంలో రావిరాల జంక్షన్ వద్ద ప్రయాణం మొదలైతే.. ముచ్చర్ల/బేగరికంచె వరకు సిగ్నల్‌ఫ్రీ జర్నీ చేసేలా రూపకల్పన చేస్తోంది. ఈ రోడ్డుతో పాటు రైలు మార్గాన్ని కొత్త డిజైన్ చేయడం ద్వారా నాలుగో నగరానికి వన్నెలు తేవాలని ప్రభుత్వం భావిస్తోంది.

అంతర్రాష్ట్ర ముఠా గుట్టు రట్టు!

- 3.8 కేజీల హ్యాష్ ఆయిల్ స్వాధీనం
- ముగ్గురు అరెస్టు


మీడియా సమావేశంలో మాట్లాడుతున్న సీఐ రాఘవేందర్‌రెడ్డి

ఇబ్రహీంపట్నం రూరల్: తక్కువ ధరకు హ్యాష్ ఆయిల్ తీసుకొచ్చి ఎక్కువ ధరకు విక్రయిస్తున్న అంతరాష్ట్ర ముఠాను ఆదిబట్ల, మహేశ్వరం జోన్ ఎస్‌ఓటీ పోలీసులు అరెస్టు చేశారు. ఆదిబట్ల సీఐ రాఘవేందర్‌రెడ్డి శనివారం విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. విశాఖపట్నం జిల్లా, కింతలి వల్లాపురం గ్రామం, మాడుగుళ్ల మండలానికి చెందిన తాళ్లపురెడ్డి సుధీర్(23), తాళ్లపురెడ్డి దేముళ్లు (26), రవికమతం మండలానికి చెందిన కేశంశెట్టి శంకర్‌రావు(26)లు కొంత కాలంగా సులువుగా డబ్బు సంపాదించేందుకు మాదక ద్రవ్యాల వ్యాపారంలోకి దిగారు. ఆంధ్రప్రదేశ్ నుంచి హ్యాష్ ఆయిల్‌ను కొనుగోలు చేసి హైదరాబాద్‌లో ఎక్కువ ధరకు విక్రయించాలని భావించారు. ఒడిశాకు చెందిన శ్రీను అలియాస్ శ్రీనివాస్ సుధీర్‌కు పరిచయస్తుడు. గంజాయి విక్రయం ద్వారా చాలా డబ్బు సంపాదించొచ్చని తెలపడంతో అక్రమ వ్యాపారంలోకి దిగాలని చూశారు. తాళ్లపురెడ్డి సుధీర్, కేశంశెట్టి శంకర్‌రావులు అనకాపల్లిలోని అల్లంచెట్టు హిల్స్ నుంచి కొనుగోలు చేశారు. అక్కడి నుంచి హైదరాబాద్ ఔటర్‌రింగ్‌రోడ్డుకు చేరుకున్నారు. ఆ తర్వాత బొంగ్లూర్ వద్దకు రాగానే ఆటోలో ఎక్కి అవసరమైన వారికి విక్రయించేవారు. టీసీఎస్ సమీపంలో హ్యాష్ ఆయిల్ విక్రయిస్తున్నారని సమాచారంతో ఎస్‌ఓటీ పోలీసులు ఆదిబట్ల పోలీసులు దాడి చేసి పట్టుకున్నారు. వారి వద్ద 3.8 కేజీల హ్యాష్ ఆయిల్, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. వీటి విలువ రూ.31లక్షలు ఉంటుందని తెలిపారు. శనివారం వారిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించినట్లు సీఐ రాఘవేందర్‌రెడ్డి తెలిపారు.

కుర్మిద్ద పాఠశాల వంట గదిలో చోరీ

యాచారం: మండల పరిధిలోని కుర్మిద్ద ఉన్నత పాఠశాల వంట గదిలో శుక్రవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. వివరాలు ఇలా ఉన్నాయి.. రోజు మాదిరిగానే శనివారం వంట సిబ్బంది వంట గదికి వెళ్లారు. అక్కడ తాళం పగులగొట్టడాన్ని వారు గమనించారు. ఈ ఘటనలో వంట గదిలోని భోజన సామగ్రిని తీసుకెళ్లినట్లు వారు తెలిపారు. ఈ విషయాన్ని సిబ్బందితో పాటు గ్రామస్తులు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

ఆగి ఉన్న టిప్పర్‌ను ఢీకొట్టిన బైక్

గాయపడిన దంపతులు

కేశంపేట: ఆగి ఉన్న టిప్పర్‌ను బైక్ ఢీకొట్టడంతో దంపతులు గాయపడ్డారు. ఈ ఘటన శనివారం రాత్రి సంగె గ్రామంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని పుట్టోనిగూడకు చెందిన పెద్దిన అంజనేయులు, అనూష దంపతులు కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. అనూష అనారోగ్యంగా ఉండడంతో శనివారం రాత్రి షాద్‌నగర్ ఆస్పత్రికి వెళ్తుండగా సంగెంలో ఆగిఉన్న టిప్పర్‌ను వెనుక నుంచి ఢీకొట్టారు. దీంతో దంపతులు తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను చికిత్స నిమిత్తం షాద్‌నగర్ ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స నిమిత్తం మహబూబ్‌నగర్ ఎస్‌వీఎస్ ఆసత్రికి తీసుకెళ్లారు.

సమయాన్ని వృథా చేయొద్దు

- కష్టపడి చదువుకోవాలి
- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి
- కోల్కులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల తనిఖీ


కోల్కులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను తనిఖీ చేస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

మాడ్గుల: విద్యార్థులు సమయాన్ని వృథా చేయొద్దని, ప్రతిఒక్కరూ కష్టపడి చదువుకోవాలని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. శనివారం మాడ్గుల మండలంలోని కోల్కులపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెల్పింగ్ హ్యాండ్స్ ఫూర్ ఆధ్వర్యంలో విద్యార్థులకు బ్యాగులు, పరీక్షప్యాడ్లు పంపిణీ చేశారు. అనంతరం పాఠశాలను తనిఖీ చేసి మాట్లాడారు. విద్యార్థులు బాగా చదువుకొని చదువుకున్న పాఠశాలకు, తల్లి దండ్రులకు కీర్తి ప్రతిష్ఠలు తీసుకురావాలని ఆయన కోరారు. వివిధ కార్యక్రమలతో ఎన్నో సేవలందిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ఫౌండేషన్ సభ్యులకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ బట్టు కిషన్ రెడ్డి, మాజీ జెడ్పీటీసీ సభ్యులు ప్రభాకర్ రెడ్డి, సీనియర్ నాయకులు కొండల్ రెడ్డి, ఫౌండేషన్ సభ్యులు గణేష్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

తండాల అభివృద్ధే లక్ష్యం: ఎమ్మెల్యే

తండాల అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. హైదారబాద్‌లో మాడ్గుల మాజీ ఎంపీపీ పద్మారెడ్డి ఆయన నివాసంలో కలిసి సన్మానించారు. పలు అభివృద్ధి పనులపై పకీర తండా, హన్య తండాలకు అండర్ డ్రైనేజీ పనుల నిర్మాణానికి ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి రూ. 2.50లక్షలు మంజూరు చేస్తున్నట్లు ప్రొసిడింగ్ కాపీని మాజీ ఎంపీపీ పద్మారెడ్డికి అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి మాట్లాడుతూ తండాల సంక్షేమానికి ప్రభుత్వం ఎంత నిధులైనా మంజూరు చేస్తుందని చెప్పారు. అనంతరం ఎంపీపీ పద్మారెడ్డి నిధులను మంజూరు చేసినందుకు ఎమ్మెల్యేకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామస్థులు భాష, జైపాల్, రవి, జగదీష్, సంతోష్, సురేష్, రాజు తదితరులు పాల్గొన్నారు.

భారత్‌ను కదలిస్తున్న బంగ్లా మారణహోమం


హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో ర్యాలీ

- బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్

షాబాద్: పొరుగు దేశం బంగ్లాదేశ్ దుస్థితి చూస్తుంటే భారతదేశ భవిష్యత్ కనిపిస్తోందని బీసీ సేన జాతీయ అధ్యక్షుడు బర్క కృష్ణయాదవ్, భజరంగ్‌దళ్ కన్వీనర్ గూడెం రమేష్ అన్నారు. శనివారం మండల కేంద్రంలో హిందూ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత్‌లో పెరుగుతున్న ముస్లిం జనాభా బంగ్లాదేశ్ సంకేతాలను మన ముందు ఉంచుతోందన్నారు. ఇక్కడి రాజకీయ అవసరాల నిమిత్తం.. ఓటు బ్యాంకు కాపాడుకునే క్రమంలో నేతలంతా ముస్లింలకు మద్దతివ్వడంలో తలమునకలయ్యారని ఆగ్రహించారు. చిన్నా, పెద్ద, మహిళలు, వృద్ధులు తారతమ్యం లేకుండా జీహాది శక్తులు అక్కడి మైనార్టీలైన హిందువులపై విరుచుకుపడుతుంటే కొందరు పరోక్షంగా సహకరిస్తున్నారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్‌లు రమేష్‌యాదవ్, చందిప్ప జంగయ్య, శ్రీనివాస్‌గౌడ్, యాదగిరి, సత్యనారాయణ, రమేష్‌యాదవ్, సురేష్, నాయకులు రాహుల్, చంద్రపాల్, రవి తదితరులు పాల్గొన్నారు.

ప్రజా భవన్‌ను ముట్టడిస్తాం

వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకుల హెచ్చరిక

ఉస్మానియా యూనివర్సిటీ: దీర్ఘకాలంగా ఉన్న తమ సమస్యలను పరిష్కరించకపోతే ప్రజా భవన్‌ను ముట్టడిస్తామని రాష్ట్ర వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులు హెచ్చరించారు. శనివారం ఓయూ ఆర్ట్స్ కాలేజీలో జనరల్‌బాడీ సమావేశం జరిగింది. బేసిక్ పే, డీఏ, హెచ్‌ఆర్‌ఏతో కూడిన స్కేల్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులను బోధిస్తున్న అధ్యాపకులకు తమతో సమాన వేతనం చెల్లించాలన్నారు. గత ప్రభుత్వం వర్సిటీల కాంట్రాక్టు అధ్యాపకులను పర్మినెంట్ చేయకుండా అన్యాయం చేసిందని, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చాకయినా పర్మినెంట్ చేస్తారనే ఆశతో ఉన్నట్లు పేర్కొన్నారు. లేని పక్షంలో రిజిస్ట్రార్ కార్యాలయాల ఎదుట ధర్నాలు, ఇందిరా పార్కు వద్ద దీక్షలతో పాటు ప్రజా భవన్‌ను ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో విజయేందర్ రెడ్డి, ఉపేందర్, దత్తాత్రేయ, శ్రీధర్, రామేశ్వర్, వెంకటేశం తదితరులు పాల్గొన్నారు.

డెంగీతో బాలుడి మృతి


గౌతమ్ (ఫైల్)

శంకర్‌పల్లి: డెంగీ జ్వరంతో బాధపడుతున్న బాలుడు మృతి చెందాడు. ఈ ఘటన శంకర్‌పల్లిలో శుక్రవారం చోటు చేసుకుంది. గ్రామస్తులు, కుటుంబ సభ్యులు తెలిపిన ప్రకారం.. మండల పరిధిలోని టంగుటూర్ గ్రామానికి చెందిన మహేశ్, సంధ్య దంపతుల కుమారుడు గౌతమ్(9) శంకర్‌పల్లిలోని ప్రైవేట్ పాఠశాలలో చదువుకుంటున్నాడు. బాలుడు ఐదు రోజులగా డెంగీతో బాధపడుతుండగా స్థానిక ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స అందించారు. శుక్రవారం సాయంత్రం వరకు ఆరోగ్యం నిలకడగానే ఉన్నా ఐదు గంటల సమయంలో ఒక్కసారిగా పరిస్థితి విషమించింది. దీంతో కుటుంబ సభ్యులు హుటాహుటిన హైదరాబాద్‌కు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు.

జీవితంపై విరక్తి చెంది..

నీటి సంపులో దూకి మహిళ ఆత్మహత్య


మాణెమ్మ (ఫైల్)

షాద్‌నగర్‌రూరల్: జీవితంపై విరక్తి చెందిన ఓ మహిళ నీటి సంపులో దూకి ఆత్మహత్యకు పాల్పడింది. ఈ సంఘటన ఫరూఖ్‌నగర్ మండల పరిధిలోని ఎలికట్ట గ్రామంలో శనివారం వెలుగులోకొచ్చింది. ఏఎస్‌ఐ శ్రీరాములు తెలిపిన వివరాల ప్రకారం...ఎలికట్ట గ్రామానికి చెందిన నక్కపెద్ద యాదయ్య, మాణెమ్మ(58) దంపతులు. వారు పాడిపశువులపై ఆధారపడి జీవనోపాధి పొందుతున్నారు. భర్త అనారోగ్యానికి గురవ్వడంతో పని భారం మాణెమ్మపై పడింది. ఈ క్రమంలో ఆమె జీవితంపై విరక్తి చెంది శుక్రవారం మధ్యాహ్నం ఓ వెంచర్‌లోని సంపులో దూకి ఆత్మహత్య చేసుకుంది. భార్య కనిపించకపోవడంతో భర్త నక్కపెద్దయాదయ్య గ్రామంలో తెలిసిన వారి ఇళ్లలో వెతికినా, బంధువులకు ఫోన్ చేసినా ఆచూకీ లభించలేదు. దీంతో రాత్రంతా గ్రామ శివారులోని పొలాల్లో వెతుకుతుండగా సంపు సమీపంలో మాణెమ్మ, టవల్, చెప్పులు కనిపించాయి. ఈ విషయాన్ని పోలీసులుకు చేరవేశారు. వారు సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని వెలికి తీశారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మృతురాలి భర్త ఫిర్యాదు మేరకు ఏఎస్‌ఐ శ్రీరాములు కేసు మోదుచేసి ర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రాజేంద్రనగర్ టౌన్ ప్లానింగ్ ఏసీపీగా శ్రీధర్



రాజేంద్రనగర్: రాజేంద్రనగర్ సర్కిల్ జీహెచ్‌ఎంసీ టౌన్‌ప్లానింగ్ అసిస్టెంట్ సిటీ ప్లానర్‌గా శ్రీధర్ శనివారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ పనిచేసిన ఖాదర్‌ను కొత్తగూడెంకు బదిలీచేశారు. వికారాబాద్‌లో విధులు నిర్వహిస్తున్న శ్రీధర్‌ను రాజేంద్రనగర్‌కు బదిలీ చేశారు. అనంతరం శ్రీధర్ మాట్లాడుతూ.. రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని ఇంటి యజమానులు తప్పనిసరిగా అనుమతులు తీసుకుని నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అక్రమ నిర్మాణాలను సహించేది లేదని స్పష్టం చేశారు. అనుమతులకు అనుగుణంగానే నిర్మాణాలు చేపట్టాలని కోరారు.